# వాట్ ఎ పిటీ..!

లావణ్యకు జాబొచ్చింది!... ఈ వార్త ఫ్రెండ్స్ సర్కిల్లో.. బంధువర్గంలో సంచలనం సృష్టించింది.

గవర్నమెంటుద్యోగమా?... బేంకుజాబా?.... నర్స్ సెలక్షనా?.... టెలిఫోన్ ఆపరేటరా?.... అసలు వచ్చిన వుద్యోగం స్టేటా? సెంట్రలా....?

కన్పించినవారల్లా ప్రశ్నలమీద ప్రశ్నలేసి కాకుల్లా పొడిచారు లావణ్యను. ఒక్కొక్కరికీ జవాబు చెప్పలేక వున్న కాస్త బుర్రా పాడైంది (అసలే ఇంటి పేరు 'బుర్రా'వారు).

కండక్టర్ వుద్యోగమా! విషయం తెలిసేక చప్పరించేశారంతా!

లావణ్య దృష్టిలో కండక్టర్ వుద్యోగం కలక్టర్ జాబ్ కంటే గొప్పదనే భావం వుంది!

కండక్టర్ జాబు చేయాలంటే.. ఓర్పు...నేర్పు రెండూ అవసరం ఉంటుంది! అనే కరకాల మనస్తత్వాలు గల ప్రయాణీకులమధ్య రోజూ ఎనిమిది గంటలు డ్యూటీ చేయాలంటే కత్తిమీద సామే!

చిల్లర తిరిగివ్వాలి! టిక్కెట్లు కరెక్ట్‌గా ఇష్యూ చేయాలి. 'ఎస్సార్' స్టేజీవచ్చేలోగా క్లోజ్ చేయాలి. కంప్లైంట్స్ రాకుండానూ... డిపోలో కేష్ షార్ట్ కట్టకుండా వుండాలంటే... ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. వాళ్ల డ్యూటీ కంటే అమితమైన కష్టం అనీ తెల్సు!

ప్రజాసేవే తనకర్తవ్యంగా భావించిన లావణ్య ఎవరెన్ని రకాలుగా విమర్శించినా జాబ్‌లో చేరటానికీ డిసైడైంది.

లావణ్యలో ఆత్మవిశ్వాసం ఎక్కువ! గాంధీ గారంతటివాడు సౌతాఫ్రికాలో పాకీ దొడ్లు శుభ్రం చేసాడంటే... మన దేశంలో... సారీ... రాష్ట్రంలో... అందులోనూ రాష్ట్ర రాజధానిలో కండక్టర్ వుద్యోగం చేయాలంటే ఎంత (అ)ప్రతిష్ఠ?...ఎంత ఆనందం?...ఎంత సంబరం? అనుకుంది.

సిగ్గు ఎగ్గు లేకుండా.. ఆడపిల్లవి.... అందునా పెళ్లికాని దానివి....పైగా బ్యూటీఫుల్ గర్ల్‌వి... పోయి పోయి లేడీ కండక్టర్ వౌతావా?.... ఎద్దేవా చేస్తూ గద్దల్లా పొడిచారు.. క్లోజ్ రెలిటివ్స్!

ఎవరేమాన్న లక్ష్య పెట్టతల్చుకోలేదు! తనకు జాబ్ ముఖ్యం! ఉద్యోగం నేటిస్త్రీ లక్షణం. పైగా తాను అథలెట్ కాబట్టి రయ్ మంటూ...కనీసం ఈ జాబైనా వచ్చింది.... ఇదీ రానివాళ్లు ఈ దేశంలో ఎందరో?-అనుకుంది.

పైగా... ఫామిలీని ఆర్థికంగా తాను అన్నివిధాలా ఆదుకోవలసిన పరిస్థితొచ్చింది.

పెద్ద అక్క చదువు ఎస్.ఎస్.సి. ఫెయిలవ్వటంతో చదవనని మొండికేసి ఆపేసింది. దానికి పుట్టెడు చెవుడు...బోలెడు నత్తి..! దానికీ జన్మలో మొగుడ్ని తేవటం అసంభవం. ఇంటిపని వంటపనీ భేషుగ్గా చేస్తుంది. స్వీట్స్ హాట్స్ తయారు చేయటంలో నేర్పరి. అట్లాంటి పెద్దక్క చేత స్వగృహాఫుడ్స్ షాప్ పెట్టించాలనేది లావణ్య కోరిక! తనకు వుద్యోగం వస్తే ఏ బేంకులోనైనా లోను దొరుకుతుందని ఆశ!

రెండో అక్క ఇంటర్‌పాసై నర్సుగా ట్రెయినింగ్ పూర్తి చేసి ఏ నర్సింగ్‌హోంలోనైనా వుద్యోగమొస్తుందేమోననే ఆశతో చెప్పులు అరిగేలా తిరుగుతోంది. దీనికి వళ్లంతా బొల్లిమచ్చలు. ఏ మగ సన్నాసీ దీన్ని పెళ్లాడటానికి ముందుకు రాడు!

తండ్రి ప్లీడరు గుమస్తా చేస్తూ పక్ష వాతంతో మంచాన పడ్డాడు.

తానెట్లాగో స్కాలర్‌షిప్ మీద డిగ్రీ లాగించింది.

తాను వుద్యోగం చేయటం...కుటుంబం కోసం తప్పనిసరైంది.

ఆ కారణంగానే తనకొచ్చిన కండక్టర్ సెలక్షనే... కలక్టరుద్యోగం వచ్చినట్లుగా పొంగిపోయింది.

అందగత్తెవి.... పైగా అథెలెట్టువి...డిగ్రీ చదివి.. ఈ బేవర్స్ వుద్యోగంలో జాయినవకుండా వుంటే బాగుండేది... అనేసి ఫ్రెండ్సంతా ముక్తకంఠంతో తిట్టి పోసినా లైట్‌గా తీసుకుంది లావణ్య!

★★★★★

పర్సనల్ ఇంటర్వ్యూకి ఎటెండైనపుడు కమిటీ అధికారుల దృష్టిలో లావణ్య నలుసులాపడింది. అడిగిన ప్రశ్నలన్నింటికి టకాటకా రిప్లై లిచ్చింది. మొత్తానికి పోస్ట్‌కి సెలక్టయింది.

హమ్మయ్య! ఓ మెట్టు దాటగలిగంది. రెండవ హర్డిల్...ఆరు వారాల ట్రెనింగ్...తాను అన్నింటా ఫస్టే!

మొత్తానికి డైలీ వేజెస్ మీద అపాయింట్‌మెంట్ ఇచ్చారు.

ఓ నాలుగు రోజుల పాటు సీనియర్ కండక్టర్స్ వెంట ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వటమూ జరిగింది.

అయిదోరోజు నుంచి సడన్‌గా పులిబోనులోకి తోయబడిన మేక పిల్లలా... లావణ్యను ఇండిపెండెంట్‌గా డ్యూటీకి పొమ్మన్నారు.

కొంత భయం... మరి కొంత డౌటు... విధి నిర్వహణ ఎలా వుంటుందానే భీతి..డ్యూటీ

సవ్యంగా చేయగలదాలేదానే ఫీలింగ్ మధ్య కత్తిమీద సాములా డ్యూటీ పూర్తిచేసి... ఇక భయం లేదనుకుంది!

చదువుకునే రోజుల్లో తన కెవ్వరూ లైనేయలేదు. లవ్‌లెటర్స్ రాయలేదు. ఢీ కొట్టలేదు. లవ్ అంటూ ముగ్గులోకి దింపలేదు. లావణ్య అంటే ఖరోడా అనే పేరు పడ్డది కాలేజీలో...

అదేమిటోగానీ... జాబ్‌లో జాయినైంది లగాయితు బియ్యం బస్తా కడుపున్న మెల్లకన్ను ముసిలి డైవరు దగ్గర నుంచి గొగ్గి పళ్ల కంట్రోలర్ వరకూ తనను వింతగా చూస్తూ జొల్లు కార్చుకోవటం లావణ్య గమనించక పోలేదు.

డిపోలో సి.ఐ. ఒకరోజున..ఎవ్వరూ లేని సమయం చూసి చెయ్యి పట్టుకుని కళ్లతో సైగ చేసాడు.

చెప్పిన మాట వినకుంటే హార్డ్ డ్యూటీస్‌కి పంపుతానంటూ ఒకటి రెండు సార్లు బెదిరించాడు.

ఒకసారి డ్యూటీ దిగి ఇంటికి పోబోయే సమయానికి ఎవరో వచ్చి డి.ఎం. గారు అర్జంట్‌గా వచ్చి కలవమన్నారని చెప్పాడు.

లావణ్యలో దడ మొదలైంది. తనేం తప్పు చేయలేదే...డ్యూటీ కరెక్ట్‌గా చేస్తూ... కంప్లైంట్ లేకుండా నెట్టుకొస్తున్నా...బాస్ ఎందుకు పిలిపించాడో బోధపడ్లేదు.

పక్కనే వున్న కుళాయి వద్ద ముఖాన్ని కడుక్కుని కర్చీఫ్‌తో తుడుచుకున్న లావణ్య డి.ఎం. రూం వద్దకు చేరుకుంది.

తలుపు బైట స్టూలు మీద కూర్చున్న అటెండరు తనను చూచి మెలికలు తిరిగిపోతూ వెకిలిగా నవ్వాడు.

లోపలికి వెళ్లి సార్‌ని కలవమని కళ్లతో సైగ చేసాడు.

తలుపు తోసుకుని బిడియపడుతూనే డిపోమేనేజర్ రూమ్‌లో కెళ్లింది లావణ్య.

'గుడ్ మార్నింగ్ సార్' విష్ చేసంది లావణ్య తలపువద్దే నిలబడి.

ఫైళ్లు చూస్తున్న డి.ఎం. తలెత్తి లావణ్య వేపు చూసాడు.

'డ్యూటీ' దిగిపోతున్నావా ఇంటికి?' నవ్వుతూ ప్రశ్నించాడు.

డిపో మేనేజర్ వీరభద్రం అంటే అందరికీ డిపోలో టెర్రర్! బొద్దు మీసాలు... గండు ముఖం... మనిషిని ఒకసారి చూస్తే...చాలు... మళ్లీ...మళ్లీ చూడాలన్పించదు. బెస్ట్ డిపోమేనేజర్ అవార్డ్‌ని రెండుసార్లు కైవసం చేసుకున్న రాక్షసుడు అంటారందరూ!

'నువ్ అథెలెట్ కూడాట కదా?...పాటలు కూడా పాడతావా? ఐమీన్... మంచి సింగర్‌వి కూడానా?...

ఏమిటీ అధిక ప్రసంగం? ఇందుకా తనను పిలిపించింది అనుకుంది లావణ్య.

'కమాన్ టాక్! టెల్‌మీ ఎబౌట్ యు...' ఛైర్లో వెనక్కువాలి అడిగాడు.

'నువ్‌చాలా స్మార్ట్‌గా..బ్యూటిఫుల్‌గా అవుపిస్తున్నావ్...

'అవున్సార్. రెండేళ్లు వరుసగా కాలేజ్ బ్యూటీ కాంటెస్ట్‌లో నెగ్గి బహుమతి పొందాను...

'ఈజిట్! కంగ్రాట్సు! నీలాంటి వాళ్లు ఈ మోటార్ ఫీల్డులో రాకూడదు బేబీ... నేనే... త్వరలోనే నిన్ను డిపార్ట్‌మెంట్ ఎగ్జామ్ కి క్లర్క్ పోస్ట్‌కి అప్పియర్ అయేట్టు చేస్తాను!... మరి నాకేం బహుమతి ఇస్తావ్... కన్ను గీటుతూ మాట్లాడాడు వీరభద్రం.

ఆఫీసర్ అంతరంగాన్ని అర్థం చేసుకోగలిగింది లావణ్య.

'సారీసార్... నా మేరుజ్ ఫిక్సైంది.... వచ్చే నెలలోనే! ఫస్ట్ ఇన్విటేషన్ మీకే ఇస్తాను. తప్పక రండి మేరేజ్‌కి. వచ్చి ఆశీర్వదించండి' అంది.

వీరభద్రం ఆలోచన్లకు బ్రేకలు పడ్డయ్!

ఇంతలో డోర్ తోసుకుని పోలీసు ఎస్సై ఎంటరై డి.ఎం.కు విష్ చేసి ఎదురుగా వున్న ఛైర్లో కూర్చున్నాడు.

'ఇతనే డి.ఎం. గారు... నావుడ్‌బీ...' కళ్లతో ఎస్సైని చూపిస్తూ అంది.

ఎస్సై తలతిప్పి లావణ్యకేసి చూచి 'నువ్వా ఇక్కడున్నావేంటి? కుశలమడిగేడు ఎస్సై మనోహర్.

'మేం ఒకరినొకరం ప్రేమించుకున్నాం....

పెద్దల అంగీకారంతో జరుగబోతున్న మేరేజ్‌సార్ మాది...

లావణ్య మాటలకు మనోహర్ స్టన్ అయ్యాడు. తెలివిగా మౌనం దాల్చాడు.

'సరే..మీరు వెళ్లండి లావణ్య... డ్యూటీ జాగ్రత్తగా చేసుకోండి... మీ మేరేజ్ ఫిక్స్‌అయిన శుభ సందర్భంగా ఇరువురికీ నా హార్టీ కంగ్రాట్స్...' డి.ఎం. అనటంతో గదిలో నుండి బైట కొచ్చి కొద్ది క్షణాలు అక్కడే నిలబడింది.

పదినిముషాల తర్వాత మనోహర్ బైటికొచ్చాడు.

ఇద్దరూ కల్సిమేడ మెట్లు దిగి కిందకొచ్చారు.

'అదేంటి సర్‌ప్రైజింగ్‌గా అలా మాట్లాడావ్..' ప్రశ్నించాడు మనోహర్

'అదంతేలే..'

'మరి మన మేరేజ్ సంగతి..' అడిగాడు.

'నాకు తెల్సు... నువ్ నన్ను కాలేజీ రోజుల నుండి ప్రేమిస్తూ ఆరాధించేవాడివని. కానీ.. ఎప్పుడూ ఇద్దరం ఓపెన్‌గా మాట్లాడుకోలేదు.

'అవునవును. నువ్వు ఎస్సంటే... నేరెడీ.. తనవేపునుండి క్లియరెన్స్ ఇచ్చాడు మనోహర్.

'పెళ్ళి అయ్యాక కూడా నేను జాబ్ చేస్తాను. నీకు అభ్యంతరం లేదుగా... ఎందుకంటే.. నేనే మా కుటుంబాన్ని పోషించాలి...' టూకీగా పరిస్థితి వివరించింది.

'నీ కండిషన్స్ అన్నీ ఎగ్రీడ్! పద... జీపు ఎక్కు నిన్ను మీ ఇంట్లోడ్రాప్ చేసి నేను స్టేషన్‌కి వెడతాను...

వేగంగా మనోహర్‌ని అనుసరించింది లావణ్య.

★★★★★

మనోహర్ లావణ్యల పెళ్లి ధూమ్ ధామ్‌గా కాకుండా... కాలనీలో గల రామాలయంలో సింపుల్‌గా జరిగింది.

ఇన్విటేషన్స్ అంటు ఎవ్వరికీ పంపలేదు.

ప్రత్యేకంగా ఎవ్వరినీ పెళ్లికి పిలవలేదు... ఇరువైపులా ముఖ్యులు ఓ యాభై మంది దగ్గర బంధువులు వచ్చి వధూవరులను ఆశీర్వదించారు.

హైలెవెల్లో హారుభూరుగ హనీమూన్‌కంటూ గొప్పలకు పోకుండా... ఇద్దరూ ఒకటైనారు.

పెళ్లికి నాలుగు రోజులు శలవు దొరకడమే కష్టమైంది. ఆ నాలుగు రోజులూ 'లాస్ ఆఫ్ పే' మీద గ్రాంటయింది.

మనోహర్ కూడా పరిస్థితులను అర్థం చేసుకున్నవాడు కాబట్టి లావణ్యతో అన్ని విధాలా కో ఆపరేట్ చేస్తూ తనూ అత్తవారింటే ఉండిపోయి ఆర్థిక పరిస్థితిని మరింత బలోపేతం చేయటానికి ప్రయత్నించటం తన అదృష్టంగా భావిస్తోంది లావణ్య.

వీక్లీ 'ఆఫ్' తప్పించి పండగ రోజుల్లో కూడా డ్యూటీ చేయాల్సి వస్తోంది. జాబ్‌లో సుఖమున్నా లేకున్నా కుటుంబసభ్యులను ఆదుకోవటం కోసం తాను కష్టపడక తప్పదు.

తండ్రికాబోతున్నాడనే శుభవార్త లావణ్య చెప్పగావిని సంబరపడ్డాడు మనోహర్.

'అసలే వట్టి మనిషివికావు. పోనీ జాబ్ మానేయకూడదూ... గుండెల మీద తల ఆన్చిపడుకున్న లావణ్య తల నిమురుతూ బుజ్జగింపుగా అన్నాడు మనోహర్.

'అల్లుడై వుండి మీరు ఒక్కరే మా కుటుంబాన్ని ఆదుకోవటం చూచే వారికి బాగుండదు. నన్నూ కష్టపడనీయండి పర్లేదు. వేన్నీళ్లకి చన్నీళ్లలా వుంటుంది'. 'గోముగా బదులిచ్చింది లావణ్య.

'నీ ఇష్టం. నీ మాట నేను ఎన్నడూ కాదనను.. మరింత అప్యాయంగ తన గుండెలకు లావణ్యను హత్తుకున్నాడు మనోహర్.

★★★★★

ఆ రోజు ఎందుకో ప్రయాణీకులతో రద్దీగా వుంది. బస్సులో ఇసుక వేస్తే రాలని జనం! మనిషికి మనిషి అతుక్కుపోయివున్నారు . ఒకటే రష్!

ఇంతలో ఓ ఆకతాయి స్టూడెంట్ టిక్కెట్టు తీసుకోకపోగా...లావణ్యతో వాదనకి దిగాడు. పరుషంగా మాట్లాడాడు. తోటి ప్రయాణీకులెవరూ కలుగచేసుకోక పోవటం అతడిని మందలించక పోవటం చూచి నివ్వెర పోయింది.

కండక్టర్ డ్యూటీ చేస్తున్నది ఓ స్త్రీ అనే గౌరవం లేకుండా.. ఆకుర్రాడు నోటికొచ్చి నట్టు పేలాడు. అసభ్య పదజాలం వుపయోగిస్తూ వుద్రేకంలో లావణ్య మీద విరుచుకు పడి ఆమెను రెండు చేతులతో తోసి బస్ స్టేజీలో ఆగక ముందే కుర్రాడు దిగి వెళ్లిపోయాడు.

బస్సులో పడిపోయిన లావణ్య బాధతో మూలిగింది. గర్భానికి దెబ్బగట్టిగా తగలటంతో రక్తస్రావం కావటం గమనించిన లేడీ పాసింజర్స్ డ్రైవర్‌ని బస్సు ఆపమంటూ కేకలు పెట్టారు.

బస్సు ఆగింది! బస్సులో ప్రయాణిస్తున్న లేడీ పాసింజర్సే లావణ్యచుట్టూ మూగేరు. మగాళ్లని బస్సుదిగి వెళ్లి పొమ్మన్నారు. ట్రిప్ కేన్సిల్! కండక్టర్ పరిస్థితి బాగోలేదు. మరో బస్సులో వెళ్లండి అంటూ డ్రైవర్ కోపంతో అరిచాడు.

లావణ్యను ఒకరిద్దరు ఆడవాళ్లు జాలిపడి దగ్గర్లో వున్న మెటర్నరీ నర్సింగ్ హోంకి ఆటోలో ఫాలో అయి సహాయపడ్డారు.

ఎంత అన్యాయం?ఎంత ఘోరం.. ఇలాంటి రిస్క్‌వున్న వుద్యోగాలు ఆడవాళ్లు ఎందుకు చేస్తారో అర్థంకాదు. లావణ్యను ఎడ్మిట్ చేసిన ప్రయాణీకులిద్దరూ గొణుకున్నారు.

ఆ కుర్ర పాసింజరు దురుసుగా ప్రవర్తించినందువల్ల లావణ్య గర్భంలో బిడ్డ దెబ్బతిని వెంటనే ఆపరేషన్ చేయవలసిన దారుణ పరిస్థితి రావటం ఘోరంగా తోచింది ఆ ఇద్దరి ఆడవారికి.

వాట్ ఏ పిటీ లావణ్యా?... నెలలు నిండేక రిస్కీ జాబ్ చేయరాదంటూ డాక్టర్ వారించింది.

-:(సమాప్తం):-